సాక్షి సూర్యాపేట

మంగళవారం । 19 । డిసెంబర్ । 2023



దళితబంధు లబ్ధిదారుల ధర్నా
తిరుమలగిరిలో సోమవారం దళితబంధు లబ్ధిదారులు వెండర్ దుకాణం ఎదుట ఆందోళన చేశారు. - 10లో



మట్టపల్లిలో నిత్యారాధనలు
మట్టపల్లి ఆలయంలోని శ్రీలక్ష్మీనృసింహ స్వామి వారికి సోమవారం అర్చకులు నిత్యారాధనలు నిర్వహించారు. - 10లో



విచారణ జరిపించాలి
కోదాడలో నిధుల దుర్వినియోగంపై విచారణ జరిపించాలని కలెక్టర్‌కు పలువురు ఫిర్యాదు చేశారు. - 10లో

న్యూస్‌రీల్

పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జ్‌లుగా మంత్రులు

- ఉత్తమ్, కోమటిరెడ్డిని నియమించిన టీపీసీసీ

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : వచ్చే మూడు నెలల్లో జరగనున్న పార్లమెంట్ ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీ నుంచి జిల్లాలో మంత్రులు నేతృత్వం వహించనున్నారు. వారినే రెండు పార్లమెంట్ నియోజక వర్గాలకు ఇన్‌చార్జ్‌లుగా టీపీసీసీ నియమించింది. నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని, భువనగిరి పార్లమెంట్ నియోజక వర్గ ఇన్‌చార్జిగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని నియమించింది.

లక్ష్యం సాధించే వరకూ విశ్రమించొద్దు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి

సూర్యాపేట టౌన్: యువత అనుకున్న లక్ష్యాన్ని సాధించేవరకూ విశ్రమించొద్దని సూర్యాపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. ఐటీ హబ్‌లో ఉద్యోగాల ఎంపిక కోసం 500 మంది యువతీయువకులకు జిల్లా కేంద్రంలో టెక్ విజన్, ఫాస్ట్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలు శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాటుచేసిన తెలంగాణ అకాడమీ ఆఫ్ స్కిల్ అండ్ నాలెడ్జ్ సెంటర్‌ను సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయత్నం చేయకుండా ఏదీ మన సొంతం కాదని, యువత పట్టుదలతో ముందుకు సాగితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చన్నారు. భావి ఇంజనీర్లుగా తమను తాము తీర్చిదిద్దుకునేందుకు సూర్యాపేట టాస్క్ సెంటర్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థులందరి ప్రయత్నం సక్సెస్ కావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా టాస్క్‌లో శిక్షణ పొంది ఉద్యోగాలు సాధించిన యువతకు అభినందనలు తెలిపారు. అనంతరం ల్యాప్‌టాప్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు కొణతం సైదిరెడ్డి యలక గోపిరెడ్డి, పవన్‌రెడ్డి పాల్గొన్నారు.

కోదండరాంను కలిసిన టీజేఎస్ నాయకులు



కోదండరాంను సన్మానిస్తున్న నాయకులు

పెన్‌పహాడ్: తెలంగాణ జన సమితి (టీజేఎస్) రాష్ట్ర అధ్యక్షుడు, తెలంగాణ ఉద్యమ రథసారథి ప్రొఫెసర్ కోదండరాంను సోమవారం హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ సూర్యాపేట జిల్లా ఎస్సీ సెల్ కన్వీనర్ బచ్చలకూరి గోపి, జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు సూర్యనారాయణ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కోదండరాంకు పూలమాల వేసి శాలువా కప్పి సన్మానించారు. తెలంగాణ రాష్ట్రంలో పదేళ్లగా కొనసాగిన నిరంకుశ ప్రభుత్వాన్ని సాగనంపడంలో కీలక పాత్ర పోషించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థుల్లో సామర్థ్యాలు పెంపొందించాలి



పసునూర్ మోడల్‌స్కూల్‌ను సందర్శించిన జిల్లా ప్యానెల్ బృందం సభ్యులు

నాగారం: ప్రభుత్వ మోడల్ స్కూళ్లలో చదువుతున్న విద్యార్థుల్లో భాషా, అభ్యసన, వృత్తివిద్యా నైపుణ్య సామర్థ్యాలను పెంపొందించాలని మోడల్ స్కూళ్ల జిల్లా ప్యానెల్ బృందం నోడల్ అధికారి సాయిఈశ్వరి అన్నారు. సోమవారం మండల పరిధిలోని పసునూర్ మోడల్ స్కూల్‌ను మోడల్ స్కూళ్ల జిల్లా ప్యానెల్ బృందం సందర్శించింది. ఈ సందర్భంగా పాఠశాల రికార్డులను పరిశీలించి, ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకు తరగతుల వారీగా అన్ని సబ్జెక్టులకు సంబంధించిన ఉన్నతి డైరీ, లెసన్ ప్లాన్, ప్రగతిపత్రాలు, నోట్‌బుక్స్, బోధనను పరిశీలించారు. అనంతరం పాఠశాల సిబ్బందితో సమావేశమై మాట్లాడారు. ఉపాధ్యాయులకు సలహాలు సూచనలు అందించారు. కార్యక్రమంలో ప్యానెల్ బృందం సభ్యులు భాగ్యలక్ష్మి, ప్రమీల, శంకరనాయక్, షరీఫ్, బాలరాజు, పాఠశాల ప్రిన్సిపాల్ కుంట రమేష్, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథపై
వాస్తవాలు చెప్పండి

- ఏ గ్రామానికి వెళ్లినా ప్రజలు నీళ్లు రాలేదంటున్నారు
- ఇవ్వాల్సిన నీళ్లు ఎన్ని.. ఇస్తున్నదెంత?
- ఇంకా ఎన్ని పనులు పెండింగ్‌లో ఉన్నాయి
- ఎమ్మెల్యేలతో చర్చించి సమగ్ర వివరాలతో నివేదిక ఇవ్వండి
- రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి
- మిషన్ భగీరథ, విద్యుత్ తదితర అంశాలపై కలెక్టరేట్‌లో సమీక్ష



కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్షలో మాట్లాడుతున్న రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి. చిత్రంలో కలెక్టర్ కర్ణన్, ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, ఎమ్మెల్యేలు లక్ష్మారెడ్డి, జయవీర్‌రెడ్డి, వీరేశం తదితరులు

నల్లగొండ : 'రూ.50 వేల కోట్లు పెట్టి మిషన్ భగీరథ పనులు చేపట్టారు. కానీ, ఏ గ్రామానికి వెళ్లినా ప్రజలు నీరు రావట్లేదంటున్నారు. వచ్చినా కొన్ని చోట్ల కలుషితంగా ఉంటున్నాయని ఫిర్యాదు చేస్తున్నారు. అధికారులు మిషన్ భగీరథపై వాస్తవాలు చెప్పండి.. ఎంత నీరు ఇవ్వాలి.. ఎంత ఇస్తున్నాం.. ఇంకా ఎన్ని పనులు పెండింగ్ ఉన్నాయి. వీటిపై సమగ్ర నివేదిక ఇస్తే సమస్యలన్నీ పరిష్కరించి ప్రజలకు తాగునీరు అందేలా చర్యలు తీసుకుంటాం' అని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. మంత్రి పదవి చేపట్టిన తర్వాత మొదటిసారిగా సోమవారం ఆయన నల్లగొండకు వచ్చారు. కలెక్టరేట్‌లోని ఉదయాదిత్య భవన్‌లో మిషన్ భగీరథ, రోడ్లు భవనాలు, ఇరిగేషన్, విద్యుత్ తదితర శాఖలపై ఆయన కలెక్టర్, ఈఎన్‌సీలతో సమీక్షించారు.

వాస్తవ పరిస్థితులు తెలుసుకోవాలి..

మిషన్ భగీరథపై సమీక్ష సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసి భగీరథ పనులు చేపట్టినా ప్రజలకు నీరు అందకపోవడమేంటని ఆయన ప్రశ్నించారు. నీళ్లే సరిగా ఇవ్వనప్పుడు జిల్లాలో ఫ్లోరోసిస్ సమస్య పోయిందని ఎలా చెప్తారని.. అది ఎంత వరకు నిజమని అన్నారు. జిల్లాలో ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో అధికారులు నియోజక వర్గాల వారీగా సమావేశాలు నిర్వహించి వాస్తవ పరిస్థితులు తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత ఈఎన్‌సీని ఆదేశించారు.

ఇళ్ల పైనుంచి విద్యుత్ లైన్లు తొలగించాలి..

విద్యుత్ సమస్యపై మంత్రి మాట్లాడుతూ సబ్ స్టేషన్ల ఏర్పాటు, విస్తరణ కోసం టెండర్లు పిలిచి పనులు చేయకపోవడంపై అధికారులను వివరణ కోరారు. కరెంట్ షాక్‌తో మృతిచెందిన వారి కుటుంబాలకు ఇప్పటికీ ఆర్థిక సాయం అందించకపోవడం బాధాకరమన్నారు. ఇళ్లపై నుంచి వెళ్లే విద్యుత్ లైన్లను తొలగించాలని, లూజ్ లైన్లను సరి చేయాలన్నారు. ధాన్యం విక్రయించిన రైతులకు వెంటనే చెల్లింపులు చేయాలని ఆదేశించారు. రేషన్ బియ్యం సక్రమంగా అందేలా చూడాలని, డీలర్లకు సంబంధించి ఖాళీలు భర్తీ చేయాలని ఆదేశించారు. నల్లగొండ - ముశంపల్లి - ధర్మాపురం రోడ్లకు సంబంధించి మొదటి సంతకం చేశానని.. వెంటనే ఆ రోడ్డును పూర్తి చేయాలని ఆదేశించారు. రాయగిరి, మోత్కూర్ రోడ్డు, దర్వేశిపురం బ్రిడ్జి, మునుగోడు నియోజకవర్గంలో మంజూరు చేసిన పనులను త్వరగా పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. ప్రభుత్వం చట్టసభల ద్వారా శాసనాలు చేస్తుందని.. ఆ పాలసీలు అమలు చేయడం ఉద్యోగుల బాధ్యత అని అన్నారు. అధికారులంతా ప్రభుత్వ పాలసీలను అమలు చేస్తూ జిల్లా అభివృద్ధికి కృషి చేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారులు, ఉద్యోగులను గౌరవిస్తుందని అందులో ఎలాంటి సందేహం లేదన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ కర్ణన్ వైద్య ఆరోగ్య శాఖ డైరెక్టర్‌గా వెళుతున్న సందర్భంగా మంత్రి శుభాకాంక్షలు తెలిపారు. కలెక్టర్ కర్ణన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి, అదనపు కలెక్టర్లు హేమంత్ కేశవ్‌పాటిల్, జె.శ్రీనివాస్, ఆర్‌అండ్‌బీ సీఈ గణపతిరెడ్డి, ఎస్‌ఈ రాజేశ్వర్‌రెడ్డి, ఎస్‌పీడీసీఎల్ ఎస్‌ఈ చంద్రమోహన్, సీఈ చెన్నారెడ్డి, ఎస్‌ఈ వెంకటేశ్వర్లు, డీఎస్‌ఓ వెంకటేశ్వర్లు, డీఎం నాగేశ్వర్‌రావు, డీపీఓ శ్రవణ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.



ఎన్జీ కళాశాల వద్ద మంత్రి కోమటిరెడ్డిని గజమాలతో సన్మానిస్తున్న అభిమానులు

నీళ్లు కలుషితమవుతున్నాయి..

మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ మిర్యాలగూడలో సరిపడా నీరు రాకపోగా వచ్చే నీళ్లు కూడా కలుషితం అవుతున్నాయన్నారు. వెంటనే మంత్రి ఆదేశాల మేరకు కలెక్టర్ కర్ణన్ అక్కడికక్కడే అదనపు కలెక్టర్ మిర్యాలగూడకు వెళ్లి సమస్య పరిశీలించి వెంటనే పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు. తుంగతుర్తి, నకిరేకల్, దేవరకొండ ఎమ్మెల్యేలు మందుల సామేల్, వేముల వీరేశం, బాలునాయక్ మాట్లాడుతూ ఎక్కడా మిషన్ భగీరథ నీరు పూర్తిస్థాయిలో రావడం లేదని, మెయిన్ పైపులైన్లు వేసి ఇంట్రా పైపులైన్లు కొన్ని చోట్ల ఇవ్వలేదని, ఇచ్చిన చోట రోడ్లు తవ్వి వదిలేశారని చెప్పారు. జెడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ దేవరకొండ నియోజక వర్గంలో నీరు సరఫరా కావడం లేదని, చిన్న చిన్న లోపాలున్నాయని అన్నారు. ఎమ్మెల్సీ నర్సిరెడ్డి మాట్లాడుతూ మాద్గులపల్లి - మోత్కూర్ రోడ్డును రెండులేన్లు చేయాలని మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా మిషన్ భగీరథ సీఈ కృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రతి మండలంలోని రెండు గ్రామాలు తీసుకుని ప్రజలు మిషన్ భగీరథ నీరు తాగేలా అవగాహన కల్పిస్తామని చెప్పారు. మిషన్ భగీరథ పనులు కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్లే కొన్ని చోట్ల పూర్తి కాలేదని చెప్పగా అలాంటి కాంట్రాక్టర్‌ను బ్లాక్ లిస్టులో పెట్టాలని మంత్రి ఆదేశించారు.

జన నీరాజనం

మంత్రి వెంకట్‌రెడ్డికి జిల్లా ప్రజలు, పార్టీ శ్రేణులు అడుగడుగునా నీరాజనం పలికారు. మొదట చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం గ్రామంలోని ఆంథోల్ మైసమ్మ ఆలయంలో మంత్రి పూజలు చేశారు. ఆ తర్వాత చౌటుప్పల్, చిట్యాల, నార్కట్‌పల్లి, నల్లగొండ పట్టణాల్లో పార్టీ కార్యకర్తలు భారీగా తరలివచ్చి స్వాగతం పలికారు. నల్లగొండ పట్టణ శివారులోని మర్రిగూడ బైపాస్ వద్ద అంబేద్కర్, జగ్జీవన్ రామ్ విగ్రహాలకు మంత్రి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అక్కడ నుంచి ర్యాలీగా ఎన్జీ కాలేజీ వరకు వచ్చారు. ఈ సందర్భంగా హెలికాప్టర్ ద్వారా కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిపై పూల వర్షం కురిపించారు. అక్కడే ఎన్టీఆర్ విగ్రహం వద్ద ప్రజలనుద్దేశించి మంత్రి కోమటిరెడ్డి మాట్లాడారు.



నల్లగొండ పట్టణంలోని మర్రిగూడ బైపాస్ వద్ద ప్రజలకు అభివాదం చేస్తున్న మంత్రి వెంకట్‌రెడ్డి

రేపు పోచంపల్లికి రాష్ట్రపతి

- టైఅండ్‌డై, ఇక్కత్ పట్టు చీరల తయారీ ప్రక్రియల పరిశీలన
- చేనేత కుటుంబాలు, అవార్డు గ్రహీతలతో ముఖాముఖి
- పకడ్బందీగా ఏర్పాట్లు



ముస్తాబవుతున్న సభాప్రాంగణం

సాక్షి, యాదాద్రి : రాష్ట్రపతి ద్రౌపది ముర్ము బుధవారం భూదాన్‌పోచంపల్లికి రానున్నారు. శీతాకాల విడిదికోసం హైదరాబాద్‌కు విచ్చేసిన ఆమె.. తన పర్యటనలో భాగంగా భూదాన్‌పోచంపల్లిని సందర్శించనున్నారు. పోచంపల్లి చేనేత టైఅండ్‌డై, ఇక్కత్ పట్టు చీరల తయారీ ప్రక్రియలను పరిశీలించనున్నారు. గంట 40 నిమిషాల పాటు రాష్ట్రపతి పర్యటన కొనసాగనుంది. రాష్ట్రపతి పర్యటనకు అధికార యంత్రాంగం చేస్తున్న ఏర్పాట్లు పూర్తి కావొచ్చాయి. భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. రాష్ట్రపతి కార్యక్రమంలో పాల్గొనే వివిధ వర్గాల ప్రతినిధుల జాబితాలను సిద్ధం చేశారు.

రాష్ట్రపతి పర్యటన సాగుతుందిలా..

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము హైదరాబాద్ నుంచి ప్రత్యేక విమానాల్లో భూదాన్‌పోచంపల్లి చేరుకుంటారు. ఇందుకోసం మూడు ఇండియన్ ఆర్మీ విమానాలను వినియోగిస్తున్నారు. భూదాన్‌పోచంపల్లికి చేరుకున్న రాష్ట్రపతికి అధికారులు ప్రత్యేకంగా స్వాగతం పలకనున్నారు. హెలిపాడ్‌నుంచి ఆమె ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 20 కార్ల కాన్వాయ్‌లో టూరిజం సెంటర్‌కు చేరుకుంటారు. భూదానోద్యమకారులైన ఆచార్య వినోభాబావే, భూదాత వెదిరె రామచంద్రారెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పిస్తారు. అనంతరం వినోభాబావే మందిరంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించనున్నారు. ఆ తర్వాత చేనేత కార్మికుని ఇంటికి వెళ్లి కార్మికుడి దంపతులతో మాట్లాడుతారు. వృత్తి ఎలా ఉంది, రోజూ లభిస్తున్న కూలి, గిట్టుబాటు అవతుందా తదితర విషయాలను తెలుసుకుంటారు. అలాగే పక్కనే ఉన్న మరో మాస్టర్ వీవర్ ఇంటికి వెళ్లి చేనేత మగ్గాలు, చీరల తయారీ, మార్కెటింగ్ విషయాలపై చర్చిస్తారు. అనంతరం చేనేత వస్త్రాల తయారీ, విక్రయదారుడు శివకుమార్ ఇంటిని సందర్శించి పట్టు చీరల తయారీ విధానంపై తెలుసుకుంటారు. పట్టు గూళ్ల నుంచి పట్టు తీయడం, రంగులద్దడం, చిటికి పోయడం, టై అండ్ డై విధానం, చీరలు నేయడం వంటి విషయాలపై ఆరా తీస్తారు. అలాగే కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఏర్పాటు చేసిన శ్రీరంజన్ యూనిట్‌ను సందర్శించనున్నారు. అనంతరం కాన్వాయ్ ద్వారా స్థానిక బాలాజీ ఫంక్షన్ హాల్‌కు చేరుకుంటారు.

వేదికపై రాష్ట్రపతితో పాటు మరో ఆరుగురు

రాష్ట్రపతితో పాటు మరో ఆరుగురు అతిథులు మాత్రమే వేదికపై ఉండనున్నారు. రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, రాష్ట్ర మంత్రులు సీతక్క, తుమ్మల నాగేశ్వర్‌రావు, ప్రభుత్వవిప్ బీర్ల అయిలయ్యతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధికారులు ఇద్దరు ఉంటారు. సభా ప్రాంగణంలో సుమారు 22మంది సభ్యులు గల రాష్ట్రపతి ప్రత్యేక భద్రతాధికారులు ఉంటారు.

అవార్డు గ్రహీతలతో ముఖాముఖి

బాలాజీ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన మగ్గాలు, చేనేత వస్త్రాల ప్రదర్శనను రాష్ట్రపతి తిలకిస్తారు. ఈ సందర్భంగా 350 మంది ప్రత్యేక ఆహ్వానితులతో ముఖాముఖి చర్చించనున్నారు. అనంతరం చేనేత కార్మికులనుద్దేశించి మాట్లాడనున్నారు.

ఆరు స్టాళ్లు ఏర్పాటు

పోచంపల్లి ఇక్కత్ వస్త్రాలకు సంబంధించి ఆరు స్టాళ్లను ప్రత్యేకంగా ఏర్పాటు చేయనున్నారు. చేనేత కార్మికుడు మగ్గం నేయడం, కార్మికురాలు ఆసుపోయడం, రాట్నం తిప్పడాన్ని రాష్ట్రపతి పరిశీలిస్తారు.

ముస్తాబవుతున్న వినోబాభావే మందిరం

భూదానోద్యమపిత ఆచార్య వినోబాభావే, ప్రథమ భూదాత వెదిరె రాంచంద్రారెడ్డి విగ్రహాలకు రాష్ట్రపతి పూలమాలలు వేసి నివాళులర్పించనున్నారు.

పూర్తికావచ్చిన ఏర్పాట్లు

భూదాన్‌పోచంపల్లి : రాష్ట్రపతి ద్రౌపదిముర్ము పర్యటన ఏర్పాట్లు పూర్తి కావచ్చాయి. సభాస్థలి, మగ్గాల ప్రదర్శన, వీఐపీల రెస్ట్‌రూమ్‌లు ఏర్పాటు చేస్తున్నారు. బాలాజీ ఫంక్షన్‌హాల్ చుట్టూ షామియానాతో పాటు బారికేడ్లు సిద్ధం చేస్తున్నారు. అలాగే పోలీస్‌స్టేషన్ పక్కన 3 హెలిపాడ్‌లు సిద్ధం చేస్తున్నారు. సోమవారం చాపర్‌లను రెండుసార్లు లాండింగ్ చేసి ట్రయల్ రన్ నిర్వహించారు. స్థానికంగా తీసుకోవల్సిన జాగ్రత్తలు, రూట్‌మ్యాప్‌పై కలెక్టర్ హనుమంత్ కె.జండగే, అడిషనల్ కలెక్టర్ భాస్కర్‌రావుతో ఎయిర్‌ఫోర్స్ అధికారులు చర్చించి పలు సూచనలు చేశారు.



రంగులతో తీర్చిదిద్దిన ఆచార్య వినోబాభావే, ప్రథమ భూదాత వెదిరె రాంచంద్రారెడ్డి విగ్రహాలు

రైతు వేదికలను పూర్తిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న గోపగాని వెంకటనారాయణగౌడ్

సూర్యాపేట టౌన్: జిల్లాలో పెండింగ్‌లో ఉన్న రైతు వేదికల నిర్మాణాలను పూర్తిచేయాలని జెడ్పీ వైస్ చైర్మన్, 3వ స్థాయీ సంఘం చైర్మన్ గోపగాని వెంకటనారాయణగౌడ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని జెడ్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన 3వ స్థాయీ సంఘం సమావేశం(వ్యవసాయం)లో ఆయన మాట్లాడారు. వ్యవసాయ రంగం ప్రభుత్వానికి కీలకమని, ఈ శాఖ ద్వారా అమలు చేస్తున్న పథకాలతో రైతులు లబ్ధిపొందేలా అధికారులు కీలక పాత్ర వహించాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న వారికి కొత్త రేషన్ కార్డులు అందజేసేటట్టు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాలని పౌర సరఫరాల శాఖ అధికారికి సూచించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ సురేష్, సభ్యులు నల్లపాటి ప్రమీల, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఇక.. పక్కాగా ప్రజావాణి

- ఫిర్యాదుల పరిశీలనకు ప్రత్యేక కమిటీ
- ఆన్‌లైన్‌లోనూ దరఖాస్తుల స్వీకరణ
- అర్జీదారులు రెండు మూడుసార్లు రాకుండా అడ్డుకట్ట
- కొత్త ప్రభుత్వం కార్యాచరణకు అనుగుణంగా యంత్రాంగం అడుగులు

దురాజ్‌పల్లి (సూర్యాపేట): కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణికి వచ్చే ప్రజల అర్జీల పరిష్కారంపై కొత్త ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. తమ సమస్యలపై అర్జీ పెట్టుకున్నా అధికారులు నెలల తరబడి పరిష్కరించడం లేదు. దీంతో గతంలో అర్జీ పెట్టుకున్న వారే మరలా ప్రజావాణికి వస్తున్నారు. ఈ నేపథ్యంలో అర్జీదారులు ఒకసారి అర్జీ పెట్టుకున్నాక మరలా రెండు మూడుసార్లు ప్రజావాణికి రాకుండా అడ్డుకట్ట వేసేందుకు కొత్త సర్కార్ చర్యలకు ఉపక్రమించింది. దీతో జిల్లా కలెక్టర్ కూడా ఆ దిశలో అడుగులు వేస్తున్నారు. పరిష్కరించిన, తిరస్కరించిన దరఖాస్తులను పరిశీలించేందుకు ఆడిట్ నిర్వహించేలా ప్రత్యేక కమిటీ ఏర్పాటుకు పూనుకున్నారు. ఇకనుంచి గ్రామ, మండల స్థాయిల్లోనే సమ్యలు పరిష్కారం కావాలని, ప్రతి ఫిర్యాదునూ ఆన్‌లైన్‌లో నమోదు చేసేలా చర్యలు తీసుకుంటున్నారు.

మండల స్థాయిలో పరిష్కారం కాకపోవడంతో..

జిల్లాలో భూ రికార్డుల ప్రక్షాళన తర్వాత భూములకు సంబంధించిన అనేక సమస్యలతో సతమతమవుతున్న రైతులకు 'ధరణి'తో మరి న్ని కొత్త చిక్కులు వచ్చాయి. ప్రజలు తమ భూ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏళ్ల తరబడి రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. మండల స్థాయిలో రెవెన్యూ అధికారులు అందుబాటులో ఉండక, ఉన్నవారు పట్టించుకోక చాలామంది రైతులు జిల్లా కేంద్రంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణికి క్యూ కడుతున్నారు. ప్రజావాణిలో సగం కంటే ఎక్కువ ఫిర్యాదులు భూ సమస్యలకు సంబంధించినవే ఉంటున్నాయి. ఫిర్యాదుల్లో సరిహద్దులు, భూ కొలతలు, పట్టాదారు పాస్ బుక్స్ రాకపోవడం, రైతుకు ఉన్న భూమికంటే రికార్డుల్లో తక్కువగా ఎంట్రీ కావడం, ఆన్‌లైన్‌లో ఎంట్రీ కాకపోవడం వంటివే సమస్యలు ఉంటున్నాయి. ఒకసారి ఫిర్యాదు ఇస్తే సమస్య పరిష్కారం కాకపోవడంతో కొందరు నాలుగైదు వారాల పాటు తిరుగుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి తద్వారా ఇకనుంచి గ్రామ, మండల స్థాయిల్లోనే సమస్యలు పరిష్కరించనున్నారు.

ఆన్‌లైన్ విధానంతోనే పారదర్శకత

ప్రజావాణి దరఖాస్తులపై అధికారుల పర్యవేక్షణ కొరవడుతుందని.. ఫిర్యాదు తీరును చూస్తుంటే అర్థం అవుతుంది. గతంలో సమస్యల పరిష్కారంలో సాధించిన ప్రగతిపై సమీక్ష ఉండేది కాదు. చాలావరకు పరిష్కరించకుండానే చేతులెత్తేస్తున్నారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ వెంకట్రావు ప్రతి ఫిర్యాదు ఆన్‌లైన్ చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. అయితే ప్రజావాణి ఫిర్యాదులకు ప్రత్యేక విభాగం ఏర్పాటు చేసి ఆన్‌లైన్ విధానాన్ని పునఃప్రారంభిస్తే సేవల్లో పారదర్శకత పెరుగుతుందని భావిస్తున్నారు. అంతే కాంకుండా పరిష్కరించినట్లు చూపుతున్న ఫిర్యాదులపై ఆడిట్ నిర్వహిస్తారని అధికారులు భావిస్తే ఫిర్యాదుదారులకు అన్యాయం జరుగకుండా ఉండే అవకాశం ఉండనుంది.

అర్జీలను త్వరగా పరిష్కరించాలి

- ప్రజావాణిలో కలెక్టర్ వెంకట్రావు



ప్రజావాణిలో వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్

దురాజ్‌పల్లి (సూర్యాపేట): మండల స్థాయిలో ఏర్పాటు చేసే ప్రజావాణిలో అందించే అర్జీలను అక్కడికక్కడే త్వరగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఎస్.వెంకట్రావు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ప్రజావాణి కార్యక్రమానికి అదనపు కలెక్టర్లు సీహెచ్..ప్రియాంక, ఏ.వెంకటరెడ్డిలతో కలిసి హాజరై మాట్లాడారు. ప్రజలు అందించే అర్జీలను ప్రజావాణి సైట్‌లో సత్వరమే నమోదుచేయలని సూచించారు. జిల్లాలోని మీ సేవ కేంద్రాల్లో ధరల పట్టిక ఉండాలని అధిక వసూళ్లపై ఫిర్యాదులొస్తే చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారిని ఆదేశించారు. త్వరలో రాష్ట్ర ముఖ్యమంత్రి రివ్యూ ఉన్నందున జిల్లా అధికారులు సంక్షేమ పథకాల నివేదికలను సత్వరమే సీపీఓకు అందించాలన్నారు. ఈ ప్రజావాణిలో మొత్తం 49 దరఖాస్తులు అందాయన్నారు. ఇటీవల జిల్లాలో సాధారణ ఎన్నికలను సజావుగా నిర్వహించినందుకు ఎంతగానో కృషిచేసిన కలెక్టర్, అదనపు కలెక్టర్లను టీఎన్‌జీఓస్ జిల్లా అధ్యక్షుడు ఎస్‌కే.జానిమియా, కార్యదర్శి దున్న శ్యామ్, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ సురేష్, డీఆర్‌డీఓ కిరణ్ కుమార్, డీఏఓ రామారావునాయక్, డీపీఓ యాదయ్య, డీఈఓ అశోక్, సీపీఓ వెంకటేశ్వర్లు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తీర్ణతాశాతం పెంచాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

టెన్త్ విద్యార్థులకు అర్థమయ్యేలా పాఠ్యాంశాలు బోధిస్తూ ఉత్తీర్ణతా శాతం పెంచాలని కలెక్టర్ వెంకట్రావు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఎన్ఐసీ హాల్‌లో జిల్లా, మండల విద్యాధికారులు, సీపీడీఎల్ మెంబర్స్‌తో తొలిమెట్టు, ఉన్నతి కార్యక్రమాలపై అదనపు కలెక్టర్ సీహెచ్.ప్రియాంకతో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉన్నతి అభ్యసన అభివృద్ధి కార్యక్రమం 6 తరగతి నుంచి 9వ తరగతి పిల్లలకు పటిష్టంగా అమలు చేయాలన్నారు. మూడో శనివారం విద్యార్థుల తల్లిదండ్రులతో నిర్వహించే సమావేశాల్లో తల్లిదండ్రులు లేవనెత్తిన సమస్యలు.. వాటికి పాఠశాల పరంగా తీసుకుంటున్న చర్యలు పేటీఎం రిజిస్టర్‌లో రాయాలన్నారు. విద్యార్థులకు అభ్యసన పరంగా ఏ సబ్జెక్టులో ఇబ్బందులు ఎదురవుతున్నాయో కూడా పేటీఎం రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. మానిటరింగ్ అధికారులు పాఠశాలను సందర్శించి తొలిమెట్టు, ఉన్నతి అమలులో లోటుపాట్లను గమనించాలన్నారు. అలాగు వారు అందించిన సలహాలను అకాడమిక్ గైడెన్స్‌రిజిస్టర్‌లో పొందుపర్చాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో డీఈఓ అశోక్, ఎంఈఓలు పాల్గొన్నారు.

'ఉద్యోగమంటే తమాషాగా ఉందా'

ఉద్యోగం అంటే తమాషాగా ఉందా అంటూ జిల్లా కలెక్టర్ వెంకట్రావు వివిధ శాఖ అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం ప్రజావాణి సందర్భంగా అధికారులతో మాట్లాడారు. ఇటీవల మండలాలకు కేటాయించిన ప్రత్యేక అధికారులు తనిఖీలు నిర్వహించి అందించిన విద్యాశాఖ నివేదికలను నేటికీ పరిశీలించకుండా నిర్లక్ష్యం వహించిన డీఈఓ అశోక్ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వైద్యశాఖ ఇతర శాఖల అధికారులపై కూడా అసహనం వ్యక్తం చేశారు. జిల్లా అధికారులకు సమాచారం అందిచడం కోసం ఏర్పాటు చేసిన వాట్సప్ గ్రూపు నుంచి కిందిస్థాయి సిబ్బందిని వెంటనే తొలగించాలని ఆదేశించారు. విధుల పట్ల అలసత్వం వహించే అధికారులు, సిబ్బంది తీరుపై ప్రభుత్వానికి రిపోర్ట్ అందిస్తామని హెచ్చరించారు.

క్లుప్తంగా

కంది పంటకు డ్రోన్‌తో పురుగుల మందు పిచికారీ



నాగారంలో కంది పంటకు మందు పిచికారీ చేస్తున్న డ్రోన్

నాగారం : రోజు, రోజుకు వ్యవసాయంలో ఆధునికత కొత్త పుంతలు తొక్కుతుంది. ఇప్పటికే ఆధునిక యంత్రాలు రావడంతో వ్యవసాయంలో పలు మార్పులు చోటు చేసుకోగా తాజా డ్రోన్ యంత్రాల రాకతో రైతులకు తక్కువ ఖర్చుతో పాటు, సమయంలో ఆదా అవుతుంది. నాగారం మండల కేంద్రానికి చెందిన రైతు కన్నెబోయిన వెంకన్న సోమవారం తాను సాగు చేసిన రెండు ఎకరాల కంది పంటకు డ్రోన్ సహాయంతో పురుగుల మందు పిచికారీ చేయించాడు. డ్రోన్‌తో కేవలం 10నిమిషాల సమయంలో ఎకరం కంది చేనుకు పురుగుల మందు పిచాకారీ పూర్తయ్యింది. కూలీలతో కంది పంటకు మందును పిచికారీ చేయిస్తే ఎకరాకు రూ.1000 వరకు ఖర్చవుతుందని, డ్రోన్ యంత్రం సహాయంతో రూ.500 ఖర్చు తగ్గడంతో పాటు సమయం ఆదావుతుందని రైతు పేర్కొన్నాడు.

చెట్టు పైనుంచి కిందపడి విద్యార్థికి గాయాలు

మోతె : చెట్టు పైనుంచి కిందపడడంతో ఓ విద్యార్థికి గాయాలయ్యాయి. ఈ ఘటన మోతె మండల పరిధిలో రాఘవాపురం గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. రాఘవాపురం గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు నిమ్మల శ్రీనివాస్ పాఠశాలలో 3వ తరగతి చదువుతున్న విద్యార్థి భాను కౌశిక్‌ను కరివేపాకు తీసుకరమ్మని కోరాడు. దీంతో భాను కౌశిక్ చెట్టు ఎక్కి కరివేపాకు తెంపుతుండగా జారి కిందపడడంతో గాయాలయ్యాయి. విద్యార్థులను సొంత పనులకు వినియోగించిన ఉపాధ్యాయుడు నిమ్మల శ్రీనివాస్‌ను వెంటనే విధుల నుంచి తొలగించి శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ అధికారులను గ్రామస్తులు కోరారు.

ఆర్టీసీ బస్సు, లారీ ఢీ.. పలువురికి గాయాలు

యాదగిరిగుట్ట రూరల్: ఆర్టీసీ బస్సు అదుపు తప్పి లారీని ఢీ కొట్టడంతో పలువురికి గాయాలయ్యాయి. ఈ ఘటన యాదగిరిగుట్ట మండల పరిధిలోని పెద్దకందుకూరు గ్రామం స్టేజీ సమీపంలో సోమవారం చోటుచేసుకుంది. వరంగల్ డిపో-1 కి చెందిన ఆర్టీసీ బస్సు సుమారుగా 40 మంది ప్రయాణికులతో వరంగల్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తోంది. మార్గమధ్యలో మండలంలోని పెద్దకందుకూరు స్టేజీ సమీపంలో రోడ్డు క్రాస్ చేస్తున్న బైక్‌ను తప్పించబోయి అదే రూట్లో వెళ్తున్న లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. గాయపడిన వారికి ఆలేరులోని ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందజేశారు.

చెట్టును ఢీకొట్టిన కారు.. ఏడుగురికి గాయాలు

నాంపల్లి : అతివేగంతో కారు అదుపుతప్పి చెట్టును ఢీకొట్టడంతో ఏడుగురికి గాయాలయ్యాయి. ఈ ఘటన నాంపల్లి మండల పరిధిలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. నాంపల్లి మండల కేంద్రానికి చెందిన ఒకే కుటుంబానికి చెందిన 11మంది సోమవారం మధ్యాహ్నం కారులో హాలియా వెళ్లారు. అక్కడ బంధువుల వివాహ రిసెప్షన్‌లో పాల్గొని రాత్రి తిరుగు ప్రయాణమయ్యారు. మార్గమధ్యలో మండలంలోని మహ్మదాపురం గ్రామ శివారు మూలమలుపులో కారు అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది. ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఏడుగురికి గాయాలయ్యాయి. స్థానికులు వారిని అంబులెన్స్‌లో నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు అందలేదు.

చేనేతకు పట్టుగొమ్మ.. పోచంపల్లి

- 'ఇక్కత్'లో ప్రపంచఖ్యాతి
- రేపు భూదాన్‌పోచంపల్లిని సందర్శించనున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

సాక్షి యాదాద్రి : ప్రపంచంలో అత్యుత్తమ పర్యాటక గ్రామాల్లో ఒకటిగా యునెస్కో గుర్తించిన భూదాన్ పోచంపల్లికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము బుధవారం రానున్నారు. భూదాన్‌పోచంపల్లిలోని టైఅండ్‌డై, ఇక్కత్ పట్టు చీరల తయారీ కేంద్రాలను ఆమె పరిశీలించనున్నారు. చేనేత పరిశ్రమకు పెట్టింది పేరు భూదాన్‌పోచంపల్లి. జిల్లాలో చేనేత రంగంపై ఆధారపడి ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 15 వేల కుటుంబాలు జీవనోపాధి పొందుతున్నాయి. ఇక్కడ తయారైన చీరలు దేశ, విదేశాల్లో ప్రాచుర్యం పొందాయి.

ప్రత్యేకతలు

- పోచంపల్లి ఇక్కత్, నారాయణపేట చీరలు, గద్వాల్ చీరలు, వరంగల్ దుర్రీలు, సిద్దిపేట గొల్లభామ చీరలు, పుట్టపాక తేలియారుమాల్ ప్రసిద్ధి.



- పోచంపల్లి ఇక్కత్ చీరలకు 2005లో మేధో సంపత్తి హక్కుల రక్షణ హక్కులు లభించాయి.
- ఐకానిక్ చీర నేయడం ద్వారా యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశాల జాబితాలో భూదాన్‌పోచంపల్లి స్థానం పొందింది.
- పోచంపల్లి ఇక్కత్ ప్రత్యేకతల్లో క్లిష్టమైన డిజైన్, రంగులను ముందుగా వార్ప్, వెఫ్ట్ పోగులపైకి బదిలీ చేసి, ఆపై వాటిని కలిపి నేయడాన్ని ప్రపంచవ్యాప్తంగా ఇక్కత్ టెక్స్‌టైల్స్ అని పిలుస్తారు.
- ప్రపంచంలోని అత్యుత్తమ పర్యాటక గ్రామాల్లో ఒకటిగా తెలంగాణలోని పోచంపల్లిని ఐక్యరాజ్యసమితి ఎంపిక చేసింది. దాని గుర్తింపుగా భారత ప్రభుత్వం 2018లో రూ.5 పోస్టల్ టికెట్ జారీ చేసింది.
- పోచంపల్లి క్లిష్టమైన డిజైన్‌లు, శక్తివంతమైన రంగులు, ప్రత్యేకమైన నేత పద్ధతులు భారతదేశం గొప్ప నేత వారసత్వాన్ని ప్రతిబింబిస్తాయి. పోచంపల్లిలోని చేనేత కార్మికులకు జీవనోపాధిని అందిస్తాయి.
- పోచంపల్లి గ్రామంలో 2,150 మగ్గాలు ఉన్నాయి. ఇందులో 4500 మంది అనుబంధ చేనేత కళాకారులు ఉన్నారు. ఇక్కత్ ఉత్పత్తుల ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా 18,000 మంది సభ్యులు చేనేత నేత, మార్కెటింగ్ కార్యకలాపాలపై ఆధారపడ్డారు.
- పోచంపల్లిలో 150 షోరూంలు ఉన్నాయి, ఇక్కత్ ఉత్పత్తులను మార్కెటింగ్ చేస్తున్నారు. వాటిలో 30 హోల్‌సేల్, 120 రిటైల్ షో రూమ్‌లు ఉన్నాయి.
- ఇక్కత్ ఉత్పత్తుల ద్వారా మగ్గురు సంత్ కబీర్ అవార్డు గ్రహీతలు, 16 జాతీయ అవార్డు గ్రహీతలు, 6 మెరిట్ సర్టిఫికెట్ హోల్డర్లు ఉన్నారు. అలాగే ఇక్కత్ నుంచి మార్కెటింగ్, డిజైనింగ్‌లో మెరిట్ సర్టిఫికేట్ హోల్డర్లు ఉన్నారు.

నా చావుకు నాన్నే కారణం !

- పురుగుల మందు డబ్బాతో సెల్ఫీ వీడియో తీసుకుని వ్యక్తి అదృశ్యం
- కోళ్లఫారం పెట్టుకుంటానంటే వద్దన్నాడని ఆరోపణ
- ఆన్‌లైన్ గేముల్లో డబ్బు పెడితే ఉన్నదంతా పోయి అప్పులయ్యాయని ఆవేదన
- యాదాద్రి భువనగిరి జిల్లాలో వీడియో కలకలం



పురుగుల మందు బాటిల్ చూపుతున్న చిలుకూరి ప్రసాద్

భువనగిరి క్రైం : 'భూమి విక్రయించగా వచ్చిన డబ్బులతో కోళ్లఫారం పెట్టుకుంటానంటే వద్దన్నాడు.. ఆన్‌లైన్ గేమ్‌లకు అలవాటు పడి డబ్బంతా పోగొట్టుకున్నా.. పైగా అప్పులు కూడా అయ్యాయి. నేను ఆత్మహత్య చేసుకుంటే అందుకు కారణం మా నాన్నే' అంటూ పురుగుల మందు డబ్బా పట్టుకుని ఓ వ్యక్తి సెల్ఫీ వీడియో తీసుకుని అదృశ్యమయ్యాడు. ప్రస్తుతం వాట్సాప్‌గ్రూపుల్లో చక్కర్లు కొడుతున్న ఆ వీడియో యాదాద్రి భువనగిరి జిల్లాలో తీవ్ర కలకలం రేపుతోంది. భువనగిరి మండలం బండ సోమారం గ్రామానికి చెందిన చిలుకూరి ప్రసాద్ (28) వ్యవసాయం చేసుకుంటూ భార్య, పిల్లలతో జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల తమకున్న భూమిలో తండ్రి ...కొంత భాగాన్ని విక్రయించి ఇద్దరు కుమారులకు రూ.40 లక్షల చొప్పున ఇచ్చాడు. ప్రసాద్ ఆ డబ్బులోంచి రూ.20లక్షలతో ప్లాట్ కొనుగోలు చేశాడు. మిగిలిన డబ్బుతో కోళ్లఫారం పెట్టుకుంటానని తండ్రిని కోరగా అందుకు ఆయన నిరాకరించాడు. మిగిలిన డబ్బును ప్రసాద్ ఆన్‌లైన్ గేమ్‌లో పెట్టగా పోవడంతో పాటు మరో నాలుగైదు లక్షల వరకు అప్పులయ్యాయి. అప్పుల వారి ఒత్తిడి తట్టుకోలేక ప్రసాద్ తండ్రిని డబ్బులు అడగ్గా ఇవ్వకపోగా మందలించాడు. దీంతో మనస్తాపం చెందిన ప్రసాద్ ఆదివారం రాత్రి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. అనంతరం సెల్ఫీ వీడియో తీసి గ్రామ వాట్సాప్ గ్రూపులో పోస్టు చేశాడు. అప్పటి నుంచి కుటుంబ సభ్యులు ప్రసాద్ కోసం గాలించగా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రసాద్ ఫోన్ లొకేషన్ సమీప సుంకిశాల గ్రామంలో చూపించగా రాత్రి వరకు వెతికినా ఫలితం లేదని కుటుంబ సభ్యులు తెలిపారు.

బత్తాయి సాగులో సరైన యాజమాన్యమే కీలకం

- పూత, పిందె రాలుడు నివారణతోనే అధిక దిగుబడులు
- అనుముల ప్రాంతీయ ఉద్యానవనశాఖ అధికారి మురళి

గుర్రంపోడు : ప్రస్తుత సీజన్‌లో ఉమ్మడి జిల్లాలోని బత్తాయి తోటల్లో పూత, పిందె విపరీతంగా రాలుతుండటం రైతులను ఆందోళనకు గురి చేస్తోంది. కొంత వరకు రాలడం సహజమేనైనా పూత, పిందె రాలుడు ఎక్కువై దిగుబడిలపై తీవ్ర ప్రభావం చూపేలా ఉందని కర్షకులు వాపోతున్నారు. ప్రస్తుతం చాలా వరకు బత్తాయి తోటలు పూత, పిందె దశల్లో ఉండగా, కొన్ని చోట్ల పూత దశలో ఉన్నాయి. బత్తాయి తోటల సాగులో సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే పూత, పిందె రాలుడును నివారించవచ్చని అనుముల ప్రాంతీయ ఉద్యానవనశాఖ అధికారి మురళి సూచిస్తున్నారు.

యాజమాన్య పద్ధతులు ఇలా..

- బత్తాయి తోటలు పూత, పిందె దశలో ఉన్నప్పుడు వేర్లు ఉన్న ప్రాంతాన్ని కదిలించరాదు. పాదులు తవ్వడం, దున్నడం ద్వారా వేర్లకు నష్టం కలుగుతుంది.
- పూత, పిందె దశల్లో క్రమపద్ధతిలో నీటి తడులివ్వా లి. బిందుసేద్యం ద్వారా కాపునిచ్చే తోటలకు రోజూ 150 లీటర్ల నీరు అందివ్వాలి. నీటి త డులు అందించడం ఎక్కువైనా, తక్కువైనా పూత, పిందె రాలుతుంది. పాదుల్లో ఎప్పుడూ గుగ్గిళ్ల పదు ను(చేతిలో మట్టిని పట్టుకుంటే ముద్ద కానిది) ఉండాలి.
- నీటి ఎద్దడితో పూత, పిందె ఎక్కువగా రాలిపోతుంది.అలస్యంగా నీటి తడులిస్తే అధిక వేడి వాతావరణంలో పూత, పిందె రాలుతుంది. ఈ నెలాఖరులోపే తోటలను నీటి తడులివ్వాలి. డ్రిప్ ద్వారా క్రమ పద్ధతిలో నీరు అందించాలి.
- పూత, పిందె రాలుడు అరికట్టడానికి 2-4డి హార్మోన్ మందు 10 పి.పి.ఎం అంటే ఒక గ్రాము మందును 100 లీటర్ల నీటిలో లేదా ప్లానోఫిక్స్ హార్మోన్ మందు 1 మిల్లీ లీటర్ 5 లీటర్ల నీటిలో కలిపి పూత సమయంలో ఒక మారు, పిందె గోళికాయ సైజు ఉన్నప్పుడు ఇంకొక సారి పిచికారీ చేయాలి. ఈ హార్మోన్‌ల ఉత్రే కరాలుగా పనిచేసి మొక్కల్లోని సుప్తావస్థను తొలగిస్తాయి. హార్మోనులను నిర్ణీత మోతాదులోనే పిచికారీ చేయాలి. మోతాదు మించితే పూత, పిందె ఎక్కువగా రాలిపోవడమేగాక చెట్టు కూడా దెబ్బతింటుంది.



పూత దశలో బత్తాయి చెట్టు

పాడి పంట

- హార్మోన్ల పిచికారీలో తగు జాగ్రత్తలు తీసుకోవాలి. మందులు మొతాదు మించితే పూత, పిందె ఎక్కువగా రాలే ప్రమాదం ఉంది.
- ఆకులు చుట్టుకుని ఉండే పురుగుల వల్ల కూడా పూత, పిందె రాలుతుంది. వీటి నివారణకు 2 మి.లీ. మిథైల్ డెమిటాన్ లేదా 2 మి.లీ. డైనుతోఘెట్ లీటర్ నీటీలో కలిపి లేత ఇగురు పూతపై పిచికారీ చేయాలి.
- తొడిమకుళ్లు తెగులు వల్ల కూడా బఠాణీ గింజ సైజు నుంచి నిమ్మకాయ సైజు వరకు కాయలు రాలిపోతుంటాయి. కాయపై తొడిమ దగ్గర పసుపు రంగులోకి మారి రాలిపోతుంటే రెండు గ్రాముల కార్బండిజమ్ మందును ఒక లీటరు నీటికి, లేదా రెండు గ్రాముల మాంకోజెబ్ ఒక లీటరు నీటికి, ఒక గ్రాము రెడోమిల్ ఒక లీటరు నీటికి చొప్పున కలిపి నెల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి.
- సూక్ష్మదాతు లోపాలతో చెట్లు పల్లగా పసుపు రంగులోకి మారి ఉంటే కూడా పూత, పిందె నిలబడదు. చలికాలంలో చలి తీవ్రతకు సూక్ష్మదాతు లోపాలు బయటపడి తోటలు పసుపు రంగులోకి మారుతుండటం కన్పిస్తుంది. సేంద్రియ ఎరువులు పత్రియేటా తప్పనిసరిగా రసాయన ఎరువులతో కలిపి వాడటం, తోటల మధ్యలో పచ్చిరొట్ట పంటలు సాగుచేసి భూమిలో కలియదున్నడం చేయడం ద్వారా చాలవరకు సూక్ష్మదాతు లోపాలు రాకుండా నివారించుకోవచ్చు.
- సూక్ష్మదాతువుల లోపాల నివారణకు జింక్ సల్ఫేట్ 5 గ్రాములు, మెగ్నిషియం సల్ఫేట్ 2 గ్రాములు, పెర్రస్ సల్ఫేట్ 2 గ్రాములు, మాంగనీస్ సల్ఫేట్ 2 గ్రాములు, బోరాక్స్ 1 గ్రాము, సున్నం 6 గ్రాములు, యూరియా 10 గ్రాములు ఒక లీటరను నీటికి కలిపి 15 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలి. సుక్ష్మదాతు లోపాలు నివారిస్తేనే ఆశించిన దిగుబడులు వస్తాయి.

మంగునల్లి నివారణ ఇలా..

బత్తాయిలో కత్తెరతోపాటు ముందు సీజన్ పంట గోళికాయ సైజు నుంచి నిమ్మకాయ సైజులో ఉంది. ఈ కాయలకు మంగునల్లి ఎక్కువగా ఆశించి నష్టం కలిగిస్తుంది. కాయలపై నల్లపురుగులు కంటికి కనిపించనంత చిన్నవిగా ఉంటాయి. వీటిని భూతద్దంలో సులభంగా చూవచ్చు. నల్లులు పిందెలు, కాయలపై పారాడుతూ తొక్కనుంచి రసం పీల్చి జీవిస్తాయి. రసాన్ని పీల్చే ప్రకియతో నల్లి నోటీ నుంచి రసాయనాన్ని వదులుతుంది. ఈ రసాయనం కాయతోలు నుంచి ప్రవించిన ద్రవం సూర్యరశ్మికి మార్పు చెంది తుప్పు రంగుగా మారుతుంది. అందుకే బయటకు కనిపించే, సూర్యరశ్మి తగిలే కాయల్లో మంగు ఎక్కువగా కనిపిస్తుంది. ఎండలు ముదురుతున్న సమయంలో మంగు నల్లులు విజృంభిస్తాయి. పిందెలకు నల్లి ఆశిస్తే రంగు కోల్పోయి మంగు ఏర్పడమే కాక కాయ ఎదగదు. మంగునల్లి కాయలకు మార్కెట్‌లో ధర పలకదు. నేడు మంగు కాయలు లేని బత్తాయి లేదు అన్నంతగా మంగునల్లి ఆశించి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

- రైతులు భూతద్దం సహాయంతో నల్లి ఉనికిపై నిఘా పెట్టి ఉంచాలి. ఒకటి, రెండు నల్లులు తోటలో ఎక్కడైనా పిందె, కాయలపై గమనించగానే పిచికారీ చేయాలి.
- ప్రాథమిక క్షేత్ర ప్రదర్శనల్లోనూ, రైతు పరిశీలనలోనూ కొత్తగా వచ్చిన మందులు నల్లిని సమర్థవంతంగా అరికట్టినట్లు తేలింది. లీటరు నీటికి 2 మిల్లీ లీటర్ల ప్రాపర్‌గైట్ లేదా డైపెంథిరాన్ ఒక గ్రాము లీటరు నీటికి చొప్పున లేదా లీటర్ నీటికి 5 మిల్లీ లీటర్ల డైకోఫాల్ మందును మార్చుతూ పది రోజుల వ్యవధిలో రెండు, మూడు సార్లు పిచికారీ చేయాలి.
- పిందెలు గోళికాయ నుంచి నిమ్మపండు సైజులో ఉన్నప్పుడు లీటరు నీటికి 5 గ్రాములు సల్ఫేట్ ఆఫ్ పొటాష్‌ను లేదా మల్టికెను ఒక మారు పిచికారీ చేస్తే నల్లిని అణచివేయడంతో పాటు కాయ నాణ్యత పెరుగుతుంది.

హామీలను అమలు చేస్తాం.. మాట నిలబెట్టుకుంటాం

- భువనగిరి ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి

భూదాన్‌పోచంపల్లి : ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసి, ఇచ్చిన మాట నిలబెట్టుకొంటామని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం సాయంత్రం ఆయన ఎమ్మెల్యేగా మొదటిసారిగా పోచంపల్లిని వచ్చారు. ఈ సందర్భంగా స్థానిక అంబేద్కర్ విగ్రహం నుంచి నేతాజీ చౌరస్తా వరకు భారీ విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. స్థానిక మార్కండేశ్వరస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాగా ఈ సందర్భంగా కుంభం అనిల్‌కుమార్‌రెడ్డికి కాంగ్రెస్ నాయకులు భారీ గజమాలతో సత్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజాస్వామిక ప్రభుత్వం వచ్చిందన్నారు. అన్ని వర్గాల ప్రజల ఆకాంక్షలు నెరవేర్చుతామని తెలిపారు. ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన గ్యారంటీ స్కీమ్‌లను అమలు చేస్తామని భరోసా ఇచ్చారు. భువనగిరి ఎమ్మెల్యేగా భారీ మెజారిటీగా గెలిపించిన ప్రజలందరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పాక మల్లేశ్‌యాదవ్, బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షుడు తడక వెంకటేశం, భారత లవకుమార్, మర్రి నర్సింహారెడ్డి, సామ మధుసూధన్‌రెడ్డి, రాఘవరెడ్డి, పీఏసీఎస్ వైస్‌చైర్మన్ సామ మోహన్‌రెడ్డి, గునిగంటి రమేశ్, భారత వాసుదేవ్, కౌన్సిలర్లు భోగ భానుమతివిష్ణు, మోటె రజిత రాజు, మెరుగు శశికళ, కుడికాల సృజన, సీత సుధాకర్, గునిగంటి వెంకటేశ్, కుక్క కుమార్, జింకల కుమార్, కీర్తి సంజీవ, జయసూర్య పాల్గొన్నారు.



భువనగిరి ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డిని గజమాలతో సన్మానిస్తున్న నాయకులు

గూడు లేక ఊరు చివరన వృద్ధురాలి మృతదేహం

- ముందుకొచ్చి దహన సంస్కారాలు నిర్వహించిన పద్మశాలీ సంఘం నాయకులు



ఊరు బయట ఖాళీ స్థలంలో రాధమ్మ మృతదేహం

మోత్కూరు : ఆమె ఓ నిరుపేద. రెండేళ్ల క్రితమే భర్త చనిపోయాడు. కుమార్తెకు వివాహం కాగా, ఉన్న ఇద్దరు కుమారుల్లో పెద్దవాడు దివ్యాంగుడు కాగా చిన్నకుమారుడు పెళ్లి చేసుకొని హైదరాబాద్‌కు వెళ్లి అక్కడే ఉన్నాడు. తండ్రి అంత్యక్రియలకు కూడా హాజరుకాలేదు. పింఛన్‌పై ఆధారపడి ఆ తల్లీకుమారుడు అద్దె ఇంట్లో ఉంటున్నారు. ఇలాంటి తరుణంలో ఆమె అనారోగ్యంతో మృతిచెందింది. గూడు లేదని ఆమె కుమారుడు తల్లి మృతదేహాన్ని గ్రామ శివారులోని అంగడి బజార్‌లో ఉంచి సాయం కోసం అర్థించిన హృదయ విధారక ఘటన యాదాద్రి భువనగిరి జిల్లాలో చోటు చేసుకుంది. మోత్కూరు పట్టణ కేంద్రంలోని అంగడిబజార్‌లో అద్దె ఇంట్లో నివాసం ఉంటున్న కొర్రె రాధమ్మ (80) సోమవారం తెల్లవారు జామున అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో ఆమె పెద్ద కుమారుడు వెంకటేశ్వర్లు దిక్కుతోచని స్థితిలో తల్లి మృతదేహాన్ని అంగడి బజార్ ఖాళీ స్థలంలో ఉంచి రోదించాడు. విషయం తెలుసుకున్న పద్మశాలీ సంఘటం నాయకులు ముందుకొచ్చి రాధమ్మ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు. దివ్యాంగుడైన వెంకటేశ్వర్లును ఆదుకోవడానికి మోత్కూరు వాట్సాప్ గ్రూపు సభ్యులు 85 మంది రూ.55 వేల విరాళాలను అందజేశారు. ఈ విరాళాన్ని మృతురాలి కుమారుడికి అందజేయనున్నట్లు గ్రూపు సభ్యులు తెలిపారు.

షార్ట్‌సర్క్యూట్‌తో పశువుల కొట్టం దగ్ధం



ప్రమాదంలో దగ్ధమైన పశువుల కొట్టం

మునుగోడు: షార్ట్ సర్క్యూట్‌తో పశువులకొట్టం దగ్ధమైంది. మునుగోడు గ్రామ పంచాయతీ పరిధిలోని సొనబండ గ్రామానికి చెందిన చిలుముల నర్సింహ గ్రామ శివారులో వేసుకున్న పశువుల కొట్టంలో అర్ధ రాత్రి సమయంలో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. గమనించిన గ్రామస్తులు పోలీసులతో పాటు ఫైర్ అధికారులకు తెలియజేశారు. నల్లగొండ నుంచి ఫైర్ ఇంజన్ వచ్చి మంటలు ఆర్పింది. అయితే అప్పటికే ఆ పశువుల కొట్టంలోని 60క్వింటాళ్ల పత్తి, ఎడ్ల బండి, ఓ ద్విచక్ర వాహనంతో పాటు వ్యవసాయ పరికరాలు దగ్ధమయ్యాయి. ఈ ప్రమాదంలో దాదపు రూ. 5లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు చెప్పాడు. తహసీల్దార్ నరేందర్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఉన్నత అధికారులకు నివేదిక అందజేస్తానని తెలిపారు.

గురుకుల విద్యార్థులకు జాతీయ అవార్డులు

హుజూర్‌నగర్ : ముంబాయికి చెందిన రంగోత్సవం సెలబ్రేషన్స్ సంస్థ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా సెప్టెంబర్‌లో నిర్వహించిన వివిధ ఆర్ట్ విభాగాల్లో హుజుర్‌నగర్ గురుకుల విద్యార్థులకు పలు జాతీయ అవార్డులు వచ్చినట్లు స్థానిక సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సిహెచ్ రాధాకృష్ణమూర్తి సోమవారం తెలిపారు. సెప్టెంబర్‌లో ఆఫ్‌లైన్‌లో నిర్వహించిన ఈ పోటీల ఫలితాలను సోమవారం వెల్లడించినట్లు ఆయన తెలిపారు. వివిధ ఆర్ట్స్ విభాగాల్లో గురుకుల పాఠశాల, కళాశాల విద్యార్థులకు 50జాతీయ అవార్డులు లభించినట్లు తెలిపారు. వాటిలో భానుప్రకాస్‌కు జాతీయ ద్వితీయ వెండి పతకం, అభిషేక్‌కు జాతీయ 4వ బహుమతితో పాటు గోల్డ్ మెడల్, వేదంరాం జాతీయ మెరిట్ అవార్డు, ట్రోఫీ లభించినట్లు తెలిపారు. మరో 33 గోల్డ్ మెడల్స్, 10 రజిత పతకాలు, 4 కన్సోలేషన్ బహుమతులు తెలిపారు. అంతే కాకుండా ప్రిన్సిపాల్ రాధాకృష్ణమూర్తికి జాతీయ లీడర్‌షిప్ కల్చరల్ అవార్డు, అలాగే ఆర్ట్ టీచర్ డాక్టర్ నాగజానుకు జాతీయ కళాజీవి అవార్డు, ఆర్ట్ విభాగంలో జాతీయ ఐకాన్ అవార్డు లభించినట్లు వివరించారు. అవార్డు గ్రహీతలు జనవరిలో జరిగే అంతర్జాతీయ ఆర్ట్ కాంపిటీషన్‌లలో పాల్గొంటారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రంగ నాయక్, పీజీటీ విజయలక్ష్మి, టీజీటీలు రాంబాబు, చిరంజీవి,యాస్మిన్, ప్రమీల, జ్యోతి, పాల్గొన్నారు.



జాతీయ అవార్డు పొందిన విద్యార్థులతో ప్రిన్సిపాల్, ఆర్ట్ టీచర్, పీజీటీలు

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

VILLA FOR SALE

- Ready To Occupy Duplex Luxury 3 BHK - 2340 Sft Villas in the Best Gated Community at Miryalaguda Next to New D-Mart. Club House, Swimming Pool Fully Operational. Must See Call: 7013578378. [H-788030]

LAND FOR SALE

- R.R.R రోడ్‌కు 1 కిమీ దూరంలో గ్రా. కోనపురం, మం. తుర్కపల్లి, జి. యాదాద్రి, (1.13 ఎకరా ల్యాండ్) వ్యవసాయ భూమి అమ్మకము కలదు. ఫోన్: 9700223688. [H-793636]

Services

- వ్యక్తిగత, వ్యవసాయ, వ్యాపార ప్రాపర్టీ కొరకు అతి తక్కువ వడ్డీతో రుణాలు. సిబిల్ అవసరం లేదు. NPA కూడా ధరఖాస్తు. డాల్ఫిన్ ఫైనాన్స్, రాజన్, సెల్: 8437924006. [W-788966]

Wanted

- నూతనంగా ప్రారంభించిన మా సంస్థలో 10th, ఇంటర్ చదివిన స్త్రీ/పులు కావలెను. జీతం: 14,000+DA5500+ఫ్రీరూం. సంప్ర: నల్గొండ. సెల్: 8519891505. [L-822256]
- మా ఆఫీసు న్యూ ఫ్రాంచేజీ ద్వారా మీ ఖాళీ సమయంలో పార్ట్ టైమ్ / ఫుల్ టైమ్ గా వర్క్ చేస్తూ 15వేలు ఆపైన సంపాదించే అవకాశం. సంప్ర॥ 9177736926. [M-1167554]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడ మైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడి మృతి

మిర్యాలగూడ టౌన్ : రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందగా మరొకరికి గాయాలయ్యాయి. ఈ ఘటన మిర్యాలగూడ మండలం తుంగపాడు గ్రామ శివారులో సోమవారం చోటు చేసుకుంది. మిర్యాలగూడ పట్టణంలోని షాబునగర్‌కు చెందిన చిట్టిప్రోలు వినయ్ హాలి యాలో ఉంటున్న సోదరి వద్దకు వెళ్లేందుకు ఆటో ఎక్కాడు మార్గమధ్యలో మిర్యాలగూడ మండలం తుంగపాడు శివారులో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న చిట్టిపోలు వినయ్(21)కు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. గాయపడిన ఆటో డ్రైవర్ శివను స్థానికులు మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతున్నాడు. పోస్టు మార్టం నిమిత్తం మృతదేహాన్ని మిర్యాలగూడ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని ద ర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నర్సింహులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

భువనగిరి క్రైం : రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి మృతిచెందాడు. భువనగిరికి చెందిన ముసునూరి వెంకటేశం (58) ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. విధులకు హాజరయ్యేందుకు సోమవారం వెంకటేశం బైక్‌పై కంపెనీకి బయలుదేరాడు. మార్గమధ్యలో నల్లగొండ రోడ్డులోని పెట్రోల్ బంక్ సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు అతడిని హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుడి కుమారుడు చంద్రశేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నాగరాజు తెలిపారు.

ఆటో ఢీకొని గాయపడిన వ్యక్తి..

హుజూర్‌నగర్ : ఆటో ఢీ కొన్న ప్రమాదంలో గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. హుజూర్‌నగర్‌కు చెందిన దొంతగాని సైదులు (48) ఆది వారం సాయంత్రం లింగగిరి రోడ్డులో పొలం పనులు ముగించుకుని ఇంటికి వెళ్లేందుకు రోడ్డు పైకి వచ్చాడు. ఇంతలో అదే సమయంలో హుజూర్ నగర్ నుంచి లింగగిరి వైపు వెళ్తున్న ఆటో ఢీకొట్టింది. ప్రమాదంలో గాయపడిన సైదులును సూర్యాపేట ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. కుమారుడు వినోద్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ హరికృష్ణ తెలిపారు.

యాదాద్రి ఘాట్ రోడ్డులో ప్రమాదం

- రెండు కార్లు ఢీ.. భక్తులకు స్వల్పగాయాలు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయ ఘాట్‌రోడ్డులో సోమవారం రోడ్డు ప్రమాదం జరిగింది. యాదాద్రి కొండపై నుంచి వస్తున్న కారు, కొండ కింద నుంచి మూడవ ఘాట్ రోడ్డు నుంచి వెళ్తున్న మరో కారు రెండవ మూలమలుపు వద్ద ఎదురెదురుగా ఢీ కొట్టుకున్నాయి. ఈ ఘటనలో రెండు కార్లలో ఉన్న భక్తులకు స్వల్ప గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. గాయపడిన భక్తులను భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని కొండపైన ఎస్‌పీఎఫ్ అధికారులు, పట్టణ పోలీసులు సందర్శించారు. హైదరాబాద్, జనగాం జిల్లాకు చెందిన భక్తులుగా పోలీసులు గుర్తించారు.



ఘాట్‌రోడ్డులో ప్రమాదానికి గురైన కారు

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

తొండతిరుమలగిరి బ్రాంచి జనగాం రోడ్డు, తొండతిరుమలగిరి, సూర్యాపేట జిల్లా-508223, ఇ-మెయిల్: ubin0821438@unionbankofindia.bank

స్థిరాస్తులు అమ్మకానికి అమ్మకం ప్రకటన

స్థిరాస్తులు అమ్మకానికి 2002 నాటి సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలులోని నిబంధన 8(6) అంశాలతో చదువుకొనేలా 2002 నాటి సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం క్రింద ఇవ్వబడిన ఇ-వేలం అమ్మకం ప్రకటన

ఋణగ్రహీతలు: 1) మెస్సర్స్ శ్రీ లక్ష్మీ జిరాక్స్ & జనరల్ మర్చంట్, యజమాని: గుండా ప్రమోదిని, హెచ్.నెం.6-85/1, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రక్కన, జనగాం రోడ్డు, తిరుమలగిరి, సూర్యాపేట జిల్లా, తెలంగాణ-508223. 2) శ్రీమతి గుండా ప్రమోదిని, భర్త: గుండా శ్రావణ్‌కుమార్, హెచ్.నెం.6-85/1, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రక్కన, జనగాం రోడ్డు, తిరుమలగిరి, సూర్యాపేట జిల్లా, తెలంగాణ-508223. హామీదారులు: 1) శ్రీ గుండా శ్రావణ్‌కుమార్, తండ్రి: గుండా భాస్కర్, హెచ్.నెం.6-85/1, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రక్కన, జనగాం రోడ్డు, తిరుమలగిరి, సూర్యాపేట జిల్లా, తెలంగాణ-508223 మార్టిగేజ్ చేసిన / చార్జి చేసిన దిగువ వివరించిన స్థిరాస్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, తొండతిరుమలగిరి బ్రాంచ్ అధీకృత అధికారిచే స్వాధీనం చేసుకోబడింది. సదరు ఆస్తులను రుణదాతచే "ఎక్కడ ఉన్నది అక్కడే" "ఉన్నది ఉన్నట్లే" మరియు "యదాతథం" ప్రాతిపదికన 25.01.2024 తేదీన ఉ॥ 10.00 గం॥ల నుండి సా॥ 04.00 గం॥ల వరకు (ప్రతి 10 నిమిషాల అపరిమిత పొడిగింపులతో) విక్రయించబడునని, ఋణగ్రహీత, హామీదారు మరియు సహహామీదారు నుండి యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, తొండతిరుమలగిరి బ్రాంచ్ కు బకాయిపడిన మొత్తం రూ.13,06,562/- + వడ్డీ + ఇతర ఛార్జీలు వసూలు చేయుటకై సదరు ఆస్తులు విక్రయించబడుచున్నవని సాధారణ ప్రజలకు మరియు ముఖ్యంగా ఋణగ్రహీతలు:1) మెస్సర్స్ శ్రీ లక్ష్మీ జిరాక్స్ & జనరల్ మర్చంట్, యజమాని: గుండా ప్రమోదిని (ఋణగ్రహీత), 2) శ్రీమతి గుండా ప్రమోదిని, భర్త: గుండా శ్రావణ్‌కుమార్, (ఋణగ్రహీత), 3) శ్రీ గుండా శ్రావణ్‌కుమార్, తండ్రి: గుండా భాస్కర్ (హామీదారు) లకు ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమైనది. బయానాను ముందుగాగానీ, అదేరోజుగాని చెల్లించవలెను.

సమానమైన తనఖాపుంచిన ఆస్తి

సూర్యాపేట జిల్లా రిజిస్ట్రార్, సబ్-రిజిస్ట్రార్ యొక్క న్యాయపరిధిలో, సూర్యాపేట జిల్లా, తిరుమలగిరి మునిసిపాలిటీ లిమిట్స్, తిరుమలగిరి రెవెన్యూ గ్రామము, సర్వే నెం.485 నందు 60.50 చ॥గ॥లకు సమానమైన 50.58 చ.మీ॥ విస్తీర్ణముగల స్థలము మరియు అందులో 775.71 చ॥అ॥ ప్లింత్ ఏరియాలో నిర్మించిన గ్రౌండ్‌ఫ్లోర్, ఫస్ట్ ఫ్లోర్ గల ఇంటి నెం.6-85/1 భవనమునకు సంబంధించిన యావదాస్తి. దీనికి హద్దులు: ఉత్తరం: 100 అ॥ జనగాం-సూర్యాపేట రోడ్డు; దక్షిణం: గుండా రమేష్ యొక్క స్థలము; తూర్పు: గుండా శ్రీలత యొక్క ఇంటి నెం.6-85/1 యొక్క తూర్పు పార్ట్; పడమర: నెమరుగొమ్ముల మహేశ్వరరావు యొక్క ఇల్లు.

రిజర్వుధర : రూ.16,40,000/- మరియు డిపాజిట్ చేయవలసిన బయానాసొమ్ము : రూ.1,64,000/-

బ్యాంకుకు తెలిసి ఇతర ఋణభారాలు : తెలియదు. అమ్మకం యొక్క పూర్తి నియమాలు మరియు నిబంధనల కొరకు సెక్యూర్డ్ క్రెడిటార్ అయిన యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారి వెబ్‌సైట్ www.unionbankofindia.co.in, https://www.ibapi.in మరియు ఈ-వేలం సర్వీస్ ప్రొవైడర్స్ యొక్క లింక్, www.mstcecommerce.com ఈ-వేలం సర్వీస్ ప్రొవైడర్స్ వెబ్‌సైట్ ను చూడగలరు.

తేది : 14-12-2023
ప్రదేశము : తిరుమలగిరి

సం/- అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 8(6)/ రూల్ 9(1) క్రింద చట్టబద్ధమైన 15 రోజుల అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 8(6)/ రూల్ 9(1) క్రింద దీనిని నోటీసుగా కూడా పరిగణించబడుతుంది. పైన తెలిపిన ఋణంకు సంబంధించి పైన పేర్కొన్న తేదీలో ఇ-వేలం విక్రయం నిర్వహించబడునని ఋణగ్రహీతలు / హామీదారులకు తెలియజేయడమైనది.